సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 15 । నవంబర్ । 2024



## గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సహజమని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సురేశ్ అన్నారు.

- 8లో ▸



## నేడు కార్తీక పౌర్ణమి

కార్తీక పౌర్ణమి పూజలకు జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం మార్కెట్లలో సందడి నెలకొంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /17.9

## వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

## న్యూస్‌రీల్

### గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆయన జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రారంభించారు. ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి సహాయం చేస్తానన్నారు. గ్రంథాలయాల అధికారులు బుగ్గారెడ్డి, తారకం పాల్గొన్నారు. నగరంలోని గిరిరాజ్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు.

### నెహ్రూకు ఘన నివాళి



నిజామాబాద్ అర్బన్ : దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి పర్యటనలో ప్రొటోకాల్ రగడ



ఆర్మూర్/ఆర్మూర్ టౌన్ : జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటనలో ప్రొటోకాల్ వివాదం నెలకొంది. పెర్కిట్‌లో కొనుగోలు కేంద్రాల పరిశీలనకు మంత్రి గురువారం వచ్చారు. అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, కౌన్సిలర్ పాలెపు లతల ఫొటోలు ముద్రించకపోవడాన్ని బీజేపీ నాయకులు తప్పుబట్టారు. పెర్కిట్ చౌరస్తాతో పాటు కొనుగోలు కేంద్రం వద్ద మూడు ఫ్లెక్సీలను చింపేశారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో సొసైటీ చైర్మన్ భోజారెడ్డి, బీజేపీ నాయకులు పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి వారికి సర్దిచెప్పారు.

# అండగా నిలబడితే.. అద్భుతాలే..!

నిజామాబాద్ నగరంలోని మారుతినగర్‌లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్స్‌లో బాలల దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన 'సాక్షి లిటిల్ స్టార్స్' కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. సాక్షి, అగ్గు భోజన్న నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. పిల్లలు దేశభక్తిగేయాలు ఆలపించారు. నృత్యాలు చేశారు. జాతీయ నేతల వేషధారణతో అలరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి పిల్లలతో కలిసి నృత్యం చేశారు. పిల్లలను ఆడించారు. అనంతరం విద్యార్థులకు ఆట వస్తువులు, బిస్కెట్లను పంపిణీ చేశారు.

స్నేహ సొసైటీలో చిన్నారులతో కలిసి నృత్యం చేస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి





వేదికపై జిల్లా జడ్జి సునీత కుంచాల, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి, జిల్లా సంక్షేమాధికారి రసూల్‌బీ

- దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- బాలల దినోత్సవం నేపథ్యంలో స్నేహ సొసైటీలో 'సాక్షి లిటిల్ స్టార్స్' కార్యక్రమం
- చేయూతనిచ్చిన అగ్గు భోజన్న నారాయణ చారిటబుల్ ట్రస్ట్
- అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



నిజామాబాద్ నాగారం : దివ్యాంగ విద్యార్థుల్లో మంచి టాలెంట్ ఉంటుందని.. ప్రోత్సహిస్తే భవిష్యత్తులో అద్భుతాలు సృష్టిస్తారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. 'సాక్షి లిటిల్ స్టార్స్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల హాజరై మాట్లాడారు. స్నేహ సొసైటీలో ఉన్న పిల్లలతో గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. లోపంతో జన్మించిన వారికి స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య ఓపికతో సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరి దగ్గర డబ్బులు ఉంటాయని, సేవ చేయడానికి డబ్బులు అందరు ఇస్తారని, ఇలాంటి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవడం సులువు కాదన్నారు. సాక్షి మీడియా సంస్థ ప్రత్యేకంగా బాలల దినోత్సవం రోజున సాక్షి లిటిల్ స్టార్స్‌తో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలో ఉన్న దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి, ప్రోత్సహించడానికి చేస్తున్న కృషి గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, జిల్లా సంక్షేమాధికారి షేక్ రసూల్‌బీ, అగ్గు భోజన్న నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, సాక్షి టీవీ స్టాఫర్ విఘ్నేష్, స్టాఫ్ కెమెరామన్ సాయికుమార్, ఆర్‌సీ సంజీవ్, రిపోర్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.



అగ్గు భోజన్న, నారాయణను సన్మానిస్తున్న జడ్జి

### సంక్షేమ ఫలాలు అందించాలి



దివ్యాంగ పిల్లలో ఆత్మస్థైర్యం నింపాలి. అప్పుడే సమాజంలో ఏ విధంగా జీవించాలో వారికి తెలుస్తుంది. లోపాలతో జన్మించిన పిల్లలను చిన్నచూపుతో చూడొద్దు. ప్రభుత్వం కూడా మానసిక వికలాంగులకు సంక్షేమం కోసం కృషి చేస్తుంది. సంక్షేమ ఫలాలు అందిస్తూ వారి లక్ష్యాల వైపు ప్రయాణించేలా కుటుంబ సభ్యులు, గురువులు తోడ్పాటు అందించాలి. అప్పుడే ఉన్నతంగా ఎదుగుతారు.

– పద్మావతి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



స్నేహ సొసైటీ చిన్నారులతో జిల్లా జడ్జి సునీత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి

### స్నేహ సొసైటీ సేవలు మరువలేనివి



బాలల దినోత్సవం రోజున సాక్షి లిటిల్ స్టార్ పేరుతో స్నేహ సొసైటీలో చేపట్టిన కార్యక్రమం అందరికి ఆదర్శంగా నిలుస్తుంది. మానసిక అంధ వికలాంగ విద్యార్థులను ప్రోత్సహించడానికి ముందుకు వచ్చిన సాక్షికి అభినందనలు. ఏళ్ల తరబడినా విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వారిలో దాగి ఉన్న ప్రతిభకు మెరుగులు దిద్దుతున్న స్నేహ సొసైటీ సేవలు మరువలేనివి. – రసూల్‌బీ, జిల్లా సంక్షేమాధికారి

### సంతోషంగా ఉంది



బాలల దినోత్సవం రోజున సాక్షి లిటిల్ స్టార్ పేరుతో మా పిల్లలను ప్రోత్సహించడానికి ముందుకు వచ్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. రాష్ట్రంలోనే మొదటిసారి సాక్షి మీడియా మా సేవలను ప్రోత్సహించడానికి ముందుకు వచ్చింది. మేము పడుతున్న కష్టానికి భుజం తట్టడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో పిల్లలు ఉన్నతంగా ఎదిగేలా మా వంతుగా కృషి చేస్తున్నాం.

– సిద్దయ్య, స్నేహ సొసైటీ కార్యదర్శి

### సాక్షి చొరవ అభినందనీయం



మానసిక వైకల్యం ఉన్న, అంధ విద్యార్థులతో కలిసి బాలల దినోత్సవం చేసేందుకు 'సాక్షి' మీడియా గ్రూపు తీసుకున్న చొరవ అభినందనీయం. ఇలాంటి సేవా కార్యక్రమాలు, చిన్నారులను ప్రోత్సహించే మరెన్నో కార్యక్రమాలను రూపొందించాలి.

– అగ్గు భోజన్న, అగ్గు భోజన్న-నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్





చిన్నారులకు క్రీడా పరికరాలు అందిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల



నృత్యం చేస్తున్న చిన్నారులు



దివ్యాంగుల పాటల ప్రదర్శన

# జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- లెవీ సేకరణ, ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్ : ధాన్యం సేకరణలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. లెవీ సేకరణ, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై గురువారం ఆయన కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు జరపాలని సూచించారు. రైతులు రైస్ మిల్లుల వద్ద నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల వద్దనే వారికి సమగ్ర వివరాలతో కూడిన రసీదులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడ కూడా పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని, తప్పిదాలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డిఫాల్టర్లుగా లేని రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించాలని సూచించారు. ధాన్యం మిల్లింగ్ అయిన వెంటనే సివిల్ సప్లయిస్ గోడౌన్లకు తరలించాలన్నారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నందున ఒక్క బియ్యం గింజ కూడా చెడిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా మిల్లింగ్ జరిపి బియ్యం నిల్వలను తిరిగి అందించడంలో విఫలమైన మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. లెవీ లక్ష్యానికి విఘాతం కల్పించిన మిల్లర్లపై అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టును ప్రయోగించాలన్నారు. పది రోజుల్లోగా మరోసారి తాను ఇదే అంశంపై ప్రత్యేకంగా సమీక్ష జరుపుతానని, ఆ లోపు డిఫాల్ట్ మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

# ఏసీబీకి చిక్కిన ఎస్సై, రైటర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ. 10 వేలు లంచం తీసుకుంటూ లింగంపేట ఎస్సై పబ్బ అరుణ్, స్టేషన్ రైటర్ తోట రామస్వామి ఏసీబీకి పట్టుబడ్డారు. నిజామాబాద్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాలు.. లింగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండునెలల క్రితం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై అరుణ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని ఇటీవల అదుపులోకి తీసుకుని, ఎస్సై తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కేసులో స్టేషన్ బెయిల్ కోసం నిందితుడు ఇప్పటికే రూ. 30 వేలు ఇచ్చాడు. మరో రూ. 10 వేలు ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేయడంతో విసిగిపోయి ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం రూ.10 వేలు స్టేషన్ రైటర్ రామస్వామికి ఇస్తుండగా పట్టుకున్నారు. రైటర్‌ను విచారించగా ఎస్సై ఆదేశాల మేరకు డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించాడని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఎస్సై అరుణ్, రైటర్ రామస్వామిలపై కేసు నమోదు చేశామని, ఇరువురిని నాంపల్లిలోని ఏసీబీ కోర్టు ముందు హాజరు పరుస్తామని పేర్కొన్నారు. ఏసీబీ దాడిలో సీఐలు నగేశ్, శ్రీనివాస్, వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.





లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై, రైటర్

# నేరుగా రండి.. రిజిస్ట్రేషన్ చేస్తాం

- క్రయవిక్రయదారులు, సాక్ష్యులుంటే చాలు
- డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్స్, అనుమతులు లేవు
- దస్తావేజు లేఖర్ల నిరసనతో తగ్గిన రిజిస్ట్రేషన్లు
- నష్ట నివారణ చర్యలు చేపట్టిన అధికారులు

సుభాష్‌నగర్ : డాక్యుమెంట్ రైటర్ల ధర్నాతో జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు తగ్గాయి. దీనికి తోడు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని ప్రచారం జరుగుతోంది. దీంతో అధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టారు. 'జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు తెరిచే ఉన్నాయి. ఎక్కడ కూడా రిజిస్ట్రేషన్లు నిలిచిపోలేదు. ప్రజలు నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సంప్రదిస్తే రిజిస్ట్రేషన్లు చేస్తాం.' అని ప్రకటనలు విడుదల చేస్తున్నారు. అసలు డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్స్‌లు లేవని, వారితో తమకు సంబంధం లేదని పేర్కొంటున్నారు. ప్రజలు సరైన ధ్రువపత్రాలతో నేరుగా కార్యాలయాలకు వస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని చెబుతున్నారు.



నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం



మూసి ఉంచిన డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు

### సర్క్యులర్ 257 పకడ్బందీగా అమలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రిజిస్ట్రేషన్ల శాఖపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో ఈ శాఖది కీలకపాత్ర. రిజిస్ట్రేషన్ల శాఖలో జరుగుతున్న లోటుపాట్లు, లోసుగులపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల్లో గల సీనియర్ అసిస్టెంట్లు, సబ్ రిజిస్ట్రార్లు, డీఆర్‌లు, డీఐజీలు, ఐజీ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో సర్క్యులర్ 257ను పకడ్బందీగా అమల్జేయాలని, లేకుంటే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈక్రమంలోనే ఉద్యోగుల బదిలీలు చేపట్టారు. జోన్లలోని ఇతర జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు, సబ్ రిజిస్ట్రార్లు సర్క్యులర్ 257 అమలు పై దృష్టి సారించారు. అప్పటి నుంచి నాన్ లే అవుట్ ప్లాట్లు, అనుమతులు లేని ఇండ్లు, డాక్యుమెంట్‌లో విభజన వంటి రిజిస్ట్రేషన్లను నిలిపేశారు. దీంతో నాలుగు రోజులుగా రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి.


### జిల్లా అంతటా ఇదే పరిస్థితి

జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. బోధన్ మినహా మిగతా అన్నిచోట్ల డాక్యుమెంట్ రైటర్లు ధర్నా చేస్తున్నారు. సర్క్యులర్ 257ను ఉల్లంఘించి డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయాలని దస్తావేజు లేఖర్లు సబ్ రిజిస్ట్రార్లపై ఒత్తిడి చేస్తున్నారు. అంతటితో ఆగకుండా డాక్యుమెంట్లకు అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, రిజిస్ట్రేషన్లు నిలిపేస్తున్నామని ప్రచారాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని రిజిస్ట్రేషన్ల శాఖ సీనియస్‌గా తీసుకుంది. డీఐజీ సహా ఇతర ఉన్నతాధికారులు డాక్యుమెంట్ రైటర్ల పెత్తనంపై గుర్రుగా ఉన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి, నేరుగా రిజిస్ట్రేషన్లు చేయాలని ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. ఆమేరకు డీఐజీ, డీఆర్, సబ్ రిజిస్ట్రార్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

### దుకాణాలు మూసి నిరసన

జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోగల డాక్యుమెంట్ రైటర్లకు ప్రభుత్వం నుంచి గుర్తింపు, అనుమతులు లేవు. నిబంధనలను ఉల్లంఘించి రిజిస్ట్రేషన్లు చేయాలని సబ్ రిజిస్ట్రార్లపై ఒత్తిడి చేస్తున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్‌లో దస్తావేజు లేఖర్లు దుకాణాలు మూసి ఉంచి నిరసన తెలియజేస్తున్నారు. భీమ్‌గల్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

### రిజిస్ట్రేషన్లు నిలిపేశారనే వార్త అవాస్తవం



సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ రమేష్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు అందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఎలాంటి బంద్ పాటించడం లేదని స్పష్టంచేశారు. కొందరు దస్తావేజు లేఖర్లు మాత్రమే సేవలు నిలిపేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, దానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్‌లో 'డయల్ యువర్ ఆర్టీసీ ఆఫీసర్' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం జానీ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలుపాలని కోరారు. ప్రయాణికులు ఆర్‌ఎం – 99592 26011, ఆర్మూర్ – 99592 26019, బోధన్ – 99592 26001, నిజామాబాద్ డిపో1 – 99592 26016, నిజామాబాద్ డిపో2 – 99592 26017, కామారెడ్డి – 99592 26018, బాన్సువాడ – 99592 26020 నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలుపొచ్చని, అలాగే సూచనలు చేయొచ్చని పేర్కొన్నారు.

### రాష్ట్రస్థాయికి తైక్వాండో క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: ఈనెల 16, 17 తేదీల్లో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న తైక్వాండో 38వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలకు 24 మంది తైక్వాండో క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ తెలిపారు. వినాయక్‌నగర్‌లోని బస్వాగార్డెన్స్‌లో గురువారం ఎంపికలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నిజామాబాద్ డిస్ట్రిక్ట్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య హాజరై మాట్లాడారు. మాస్టర్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు కలిగి ఉందని ఆయన తెలిపారు.

### లింబాద్రి గుట్ట జాతరకు భారీ బందోబస్తు

మోర్తాడ్: లింబాద్రి గుట్ట జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పోలీసులతోపాటు ఇతర స్టేషన్‌ల నుంచి సిబ్బందిని తరలించారు. శుక్రవారం రథోత్సవం, రాత్రికి జాతర నిర్వహించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పోలీసు బలగాలను రప్పించారు. రథోత్సవం, దైవ దర్శనం సందర్భంగా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు పోలీసు బందోబస్తు సాగనుంది.

### గంగాహారతి ఘాట్‌కు అహిల్యబాయి ఘాట్‌గా నామకరణం



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలోని గంగాహారతి ఘాట్‌కు రాణి అహిల్యాబాయి హోల్కర్ ఘాట్‌గా గురువారం నామకరణం చేశారు. సామాజిక సమరత ప్రాంత అధ్యక్షుడు నరేశ్‌బాబు, రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, ఇందూరు జిల్లా సభ్యుడు శ్రీసజన్ ఘాట్ వద్ద బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గజానన్, బాల్‌రాజ్, సతీశ్, రమేశ్, నగేశ్, సాయికిరణ్, గంగరాజు, పోశెట్టి పాల్గొన్నారు.

# ఏ దశలోనూ రైతులు నష్టపోవద్దు

- పకడ్బందీగా ధాన్యం సేకరణ
- అధికారుల సంతకాలతో రైతులకు రసీదులు
- తరుగు, కడ్తా పేరుతో కోతలు విధిస్తే చర్యలు తప్పవు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- మూడు నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో కొనుగోలు కేంద్రం బాధ్యులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి



ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌లో ట్రక్ షీట్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

డిచ్‌పల్లి/ఎడపల్లి/ఆర్మూర్/: రైతులు ఏ దశలోనూ మోసపోవద్దని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందని జిల్లా ఇన్‌చార్జి, ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి, ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌తోపాటు ఆర్మూర్ పట్టణంలో గురువారం ఆయన పర్యటించారు. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యం సేకరణ వివరాలను తెలుసుకున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని మంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఏ గ్రేడ్' ధాన్యం క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.2320తో పాటు సన్నాలకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం చెల్లిస్తుందని, ఎటువంటి అనుమానాలకు తావివ్వొద్దని సూచించారు. ధాన్యం సేకరించిన వెంటనే రైతుకు చెల్లించనున్న మొత్తం డబ్బులు, బోనస్ తదితర వివరాలతో కూడిన రసీదును సంబంధిత అధికారి సంతకంతో అందజేయాలని ఆదేశించారు. తద్వారా రైతులు మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండదని, కోతల పేరిట నష్టపోరని అన్నారు. ఎక్కడ కూడా తరుగు, కడ్తా పేరుతో కోతలు విధించకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి కేంద్రానికి ఒక అధికారిని నియమించాలని, అవసరమైతే ఇతర శాఖల అధికారుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, రైతుకు నష్టం చేకూర్చే చర్యలను ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులను అయోమయానికి గురి చేయొద్దని, వాస్తవాలు చూపాలని మీడియాకు సూచించారు. పంట మార్పిడితో భూమి సారవంతంగా ఉంటుందని, రైతులు ఆ దిశగా ఆలోచించాలని అన్నారు.

మంత్రి వెంట ఎమ్మెల్యేలు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, పైడి రాకేశ్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ వన్నెల్‌దేవి లావణ్య, మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, నాయకులు శేఖర్‌గౌడ్, నగేశ్‌రెడ్డి, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, అమానుల్లా, అమృతాపూర్ గంగాధర్, సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏవో సుధామాధురి, రైతులు ఉన్నారు.

### ఇంటింటి సర్వే పరిశీలన



మెంట్రాజ్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్ పల్లిలో అధికారులు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను మంత్రి పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాల వారికి సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకే సర్వే చేయిస్తోందన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో మంత్రి రైతులతో భేటీ అయ్యారు.

### అప్పుల భారమున్నా..



ఆర్మూర్ పట్టణం మామిడిపల్లిలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఆర్మూర్/డిచ్‌పల్లి: గత ప్రభుత్వం చేసిన అప్పుల భారంతో రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్మూర్ పట్టణం మామిడిపల్లిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రం భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు రూ.60 వేల కోట్ల అప్పులు మాత్రమే చేయగా, గత ప్రభుత్వం పదేళ్ల పాలనలోనే రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. ఈ అప్పులపై వడ్డీ రూపంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రతి నెలా రూ. 6వేల కోట్లు చెల్లిస్తోందని తెలిపారు. ఇలా తీవ్రమైన ఆర్థిక భారం ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రూ.500 లకు వంట గ్యాస్, రైతులకు పంట రుణాల మాఫీ తదితర వాటన్నింటిని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ అర్హులైన రైతులకు రైతు భరోసా కింద తప్పనిసరిగా లబ్ధి చేకూరుస్తామని స్పష్టం చేశారు. సుమారు రూ. 20 వేల కోట్లను వెచ్చిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతగా 3500 గృహాలను ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాలనే కుట్రతో ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు.

### నేడు కార్తీక పౌర్ణమి



మామిడి, చెరుకు ఆకుల విక్రయం..



పూలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నిజామాబాద్ రూరల్: అత్యంత పవిత్రమైన కార్తీక పౌర్ణమి పూజలకు ఆలయాలు, ఇళ్లు సిద్ధమయ్యాయి. తులసీ వివాహం, సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించనున్నారు. ఇందుకోసం నగరంలో పూలు, పండ్లు, చెరుకు, అరటి ఆకుల విక్రయాలు గురువారం జోరుగాసాగాయి. నీలకంఠేశ్వరాలయంలో జ్వాలాతోరణం ఎంతో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించి శివుడిని దర్శించుకున్నారు.



ఉసిరికాయలు, అరటిపండ్ల విక్రయాలు..



నీలకంఠేశ్వరాలయంలో జ్వాలాతోరణం

# గెలుపోటములు సహజం

- ఏడో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేశ్
- ముగిసిన టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్



విద్యార్థుల నృత్య ప్రదర్శన..



విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న ఇన్‌చార్జి కమాండెంట్ సురేశ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహ పడకుండా క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని ఏడో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేశ్ అన్నారు. మండలంలోని కంజర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమాండెంట్ ఎంఐ సురేశ్ జాతీయ, స్పోర్ట్స్, గురుకులాల సంస్థ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నృత్యాలు ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా ఎంఐ సురేశ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని, ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. మల్టీ జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు కొనసాగిన జోనల్ స్థాయి పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ, నైపుణ్యాన్ని ప్రదర్శించారన్నారు. స్పోర్ట్స్ మీట్ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రిన్సిపాల్ విజయలలిత ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ భూమయ్య, ముదక్‌పల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య, ప్రిన్సిపాళ్లు నళిని, రాగలత, సునీత, జోనల్ గేమ్స్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ ఉదయశీల, పీఈటీ లత, ఎస్వీపీ వినోద, జేవీపీ సునీత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### తెయూలో కబడ్డీ టోర్నీ



కబడ్డీ క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఇంటర్ కాలేజ్ కబడ్డీ ఉమెన్స్ టోర్నమెంట్‌ను వైస్ చాన్స్‌లర్ టి యాదగిరిరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో విద్యతోపాటు ఆటలకు సమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. క్రీడల్లో నైపుణ్యం ఉన్న వారిని భవిష్యత్‌లో కోచ్‌లుగా నియమిస్తామని పేర్కొన్నారు. టోర్నీలో విజేతగా గిరిరాజ్ కళాశాల జట్టు నిలవగా, రన్నర్‌గా యూనివర్సిటీ కళాశాల నిలిచింది. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ టీం ట్రోఫీలను డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్ అందజేశారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ బీఆర్ నేత, ఆయా కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### భారీ వాహనాలు అడవిమామిడిపల్లి వైపు వెళ్లొద్దు

ఖలీల్‌వాడి: రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అడవి మామిడిపల్లి వద్ద రోడ్డును మూసివేసి ట్రాఫిక్ డైవర్షన్ అమలు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి ప్రారంభమైన పనులు వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగుతాయని, భారీ వాహనదారులు అటువైపు వెళ్లొద్దని సూచించారు. నిజామాబాద్ నుంచి నేషనల్ హైవే 44 మీదుగా ఆర్మూర్‌కు చేరుకోవాలని, ఆర్మూర్ నుంచి అదే హైవే మీదుగా నిజామాబాద్‌కు చేరుకోవాలని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులు మాత్రమే చిన్నాపూర్, కల్లెడి, ఆలూర్ గ్రామాల మీదుగా ఆర్మూర్‌కు చేరుకుంటాయన్నారు.

**భారీ వాహనదారులు రావొద్దు**

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లి వద్ద రోడ్డు మూసివేసినట్లు తెలిపినప్పటికీ భారీ వాహనదారులు ఇటువైపు వస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ అన్నారు.

గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైల్వే పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అడవి మామిడిపల్లి వద్ద రోడ్డును మూసివేసినట్లు ప్రసార మాధ్యమాల ద్వారా తెలిపినప్పటికీ భారీ వాహనదారులు ఇటువైపు వచ్చి మిగతావారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు.

## క్రైం కార్నర్

### తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని హత్య

- బాన్సువాడలో వృద్ధుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

బాన్సువాడ : పట్టణంలోని ఈనెల 11వ తేదీన అర్ధరాత్రి జరిగిన వాచ్‌మెన్ వెంకట్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. సీఐ అశోక్ కేసుకు సంబంధించిన వివరాలు గురువారం వెల్లడించారు. పాత బాన్సువాడకు చెందిన వెంకట్ అనే వ్యక్తి సరస్వతి మందిరం సమీపం నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మరో వాచ్‌మెన్ పోల్కం వీరయ్య వద్ద వెంకట్ చేబదులుగా రూ.25వేలు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగివ్వాలని వీరయ్య పలుమార్లు వెంకట్‌ను కోరినప్పటికీ అతడు ఇవ్వకపోవడంతో 11వ తేదీ అర్ధరాత్రి నిర్మాణంలో ఉన్న భవనంలో నిద్రిస్తున్న వెంకట్‌పై వీరయ్య గొడ్డలితో దాడి చేశాడు. గొంతు, తల, ఎడచేయిపై నరకడంతో వెంకట్ అక్కడికక్కడే మృతి చెందాడు. 12వ తేదీన ఉదయం ఏమీ తెలియని వాడిలా వెంకట్‌ను ఎవరో చంపేశారని ఇంటి యజమానికి, చుట్టు పక్కల వారికి చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నం చేశాడు. పోలీసులు వీరయ్యను విచారించగా, తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో హత్య చేశానని అంగీకరించాడు. వీరయ్యను రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. హత్య కేసును ఛేదించిన హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్, సిబ్బంది అశోక్, హేమాంద్రిని సీఐ అభినందించారు.





### నలుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఆయుధాలతో బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. రుద్రారం గ్రామానికి చెందిన గూడ అరవింద్ మోడల్ స్కూల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడే ఉన్న కళాశాల విద్యార్థులు మహేశ్, కాచర్ల చరణ్, మేదరి చరణ్ కలిసి అరవింద్‌ను అక్కడి నుంచి పంపించారని ఎస్సై అన్నారు. ఇది మనసులో పెట్టుకున్న అరవింద్ తన స్నేహితులైన ప్రసాద్, ఇర్ఫాన్, తాజుద్దీన్‌తో కలిసి గొడ్డలి, సైకిల్ రింగ్ వెంట తీసుకువచ్చి మరోసారి తమ జోలికి వస్తే చంపేస్తామని మోడల్ కళాశాల విద్యార్థులను బెదిరించారు. మహేశ్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పేకాటస్థావరంపై దాడి

రాజంపేట: మండలంలోలోని కొండాపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న పేకాటస్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని నగదు, మొబైల్‌ఫోన్, పేక ముక్కలను సీజ్ చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. పరారైన మరికొందరిని అదుపులోకి తీసుకుంటామన్నారు. పేకాటస్థావరంపై దాడి చేసిన కానిస్టేబుళ్లు రమేశ్, బాలు, భాస్కర్, రవీందర్‌ను ఎస్సై అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గోదాం రోడ్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందిరానగర్ కాలనీకి చెందిన ఇరగదిండ్ల అంజయ్య, రాజు కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పింది ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన ఇద్దరిని స్థానికులు వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

### ఎత్తిపోతల మోటారు చోరీ

రెంజల్(బోధన్): కందకుర్తి ఎత్తిపోతల పథకం రెండో స్టేజీ వద్ద నుంచి దుండగులు బుధవారం రాత్రి ఓ మోటారును ఎత్తుకెళ్లి, మరో మోటారును అక్కడే చెత్తకుప్పలో పారేశారు. ఇనుప సామగ్రిని సైతం దొంగలు ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. పక్కా ప్లాన్‌తో మోటార్‌ను ఎత్తుకెళ్లారని, దుండగులకు స్థానికులు సహకారం అందించి ఉండాలని అనుమానాలు వ్యక్తం చేశారు. ఎస్సై సాయన్న ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించినా రాత్రి వరకు రాకపోగా, పోలీసులకు ఫిర్యాదు చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పరిస్థితి ఇలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### అల్ప్రాజోలం పట్టివేత

- నిందితుల రిమాండ్, సెల్‌ఫోన్లు, కారు సీజ్



దోమకొండ: మండలంలోని అంచనూరు గ్రామంలో ఉన్న కల్లుడిపోపై పోలీసులు గురువారం దాడి చేసి నిషేధిత అల్ప్రాజోలంను పట్టుకున్నారు. కల్తీ కల్లు తయారు చేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, దోమకొండ ఎస్సై ఆంజనేయులు డిపోపై దాడి చేసి 50 గ్రాముల అల్ప్రాజోలంతోపాటు 100 గ్రాముల ఇతర రసాయనాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకులు సిద్ధాగౌడ్, నారాగౌడ్, బాబాగౌడ్‌ను అరెస్ట్ చేశారు. వీరికి అల్ప్రాజోలం సరఫరా చేసిన వెంకటరమణ్‌గౌడ్‌ను సైతం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఓ కారుతో పాటు సెలఫోన్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.